క్లుప్తంగా

కట్యాచార్యులపేటలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస రూరల్: మండలంలో కట్యాచార్యులపేట గ్రామంలో గల అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఆలయ ఉత్సవాలను ఘనంగా చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా విఘ్నేశ్వర పూజ, పరిషత్ అఖండ దీపారాధన, విశేష హోమాలు నిర్వహించారు. పూజలు అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడంతో గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ ఎన్ని రామచంద్ర రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



చల్లవానిపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

జలుమూరు: రైతులకు విక్రయించే విత్తనాల్లో ఆయా డీలర్లు, వ్యాపారులు నిబంధలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం నిఘా, అమలు విభాగం ఎస్ఐ అశోక్ చక్రవర్తి, ఏఓ రవికిశోర్ అన్నారు. బుధవారం చల్లవానిపేటలో పలు విత్తన డీలర్లు షాపులను తనిఖీలు నిర్వహించారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతీ బస్తాకు రసీదు ఇవ్వాలన్నారు. ధరలు పట్టిక అందరికీ కనిపించేలా పెట్టాలన్నారు. బిల్లు పుస్తకంపై రైతుల సంతాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మొలక శాతం కట్టి అమ్మకాలు జరపాలన్నారు. మండల వ్యవసాయ అధికారి కె.సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు పరిశీలన



బ్యాగులను పరిశీలిస్తున్న ఎంఈఓ

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ 83 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 5,600 మంది విద్యార్థులకు పంపిణీ చేసేందుకు జగనన్న విద్యా కానుక కిట్లు స్థానిక బోర్డు స్కూల్లో ఉన్న నిల్వ కేంద్రానికి చేరుకుంటున్నాయి. బుధవారం విద్యార్థులకిచ్చే బ్యాగులు వచ్చాయి. వీటిని ఎంఈఓ తదితరులు పరిశీలించారు. ఇప్పటికే జగనన్న కిట్లులో వస్తువులు చాలా మేరకు వచ్చాయని వీటిని స్కూల్ ప్రారంభం రోజునే అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈఓ తెలిపారు.

నేడు బొడ్డేపల్లి విగ్రహావిష్కరణ

పోలాకి: మండలంలోని సుసరాం గ్రామంలో దివంగత ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి వేడుకలు సందర్భంగా ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ దుంపల ఆనందరావు బుధవారం తెలిపారు. ఇదే వేదికపై నరసన్నపేట ఏఎంసీ చైర్మన్‌గా ఇటీవల నియమింపబడిన దుంపల భాస్కరరావు, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు ఒక ప్రకటనలో చెప్పారు. మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో పాటు పలువురు నాయకులు హాజరవుతారన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



అవార్డు, ప్రశంసాపత్రం అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక జేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వలంటీర్లకు అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప ఆశయం, లక్ష్యాన్ని వలంటీర్ల ద్వారానే సాధిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా అందిస్తున్నామన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశంలోనే మంచిపేరు తెచ్చిపెట్టిందని కొనియాడారు. గ్రామ స్థాయిలో వలంటీర్లే ప్రజాపాలనకు మూల స్తంభాలని పేర్కొన్నారు. పేదలకు, పెత్తందార్లకు మధ్య పోరాటం జరుగుతుందని, పేదల పక్షాన ప్రభుత్వం నిలబడిందన్నారు. గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు గురుతర బాధ్యతను మోస్తున్నారన్నారు. పేదలను ధనవంతులుగా చేస్తానని చంద్రబాబు చెబుతున్నారని, మరి ఆయన 14 ఏళ్ల పాలనలో ఎంత మంది పేదలను ధనవంతులుగా చేశారని ప్రశ్నించారు. అధికారులను భయపెట్టడం, దౌర్జన్యం చేయడం అలవాటుగా చేసుకున్న ఓ నాయకుడా వైఎస్సార్‌సీపీ కోసం మాట్లాడుతాడని పరోక్షంగా టీడీపీ మాజీ విప్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఇసుక దందాలు, భూకబ్జాలు, అక్రమ సంపాదన, హత్యలు చేయడం పనిగా పెట్టుకున్నారన్నారు. వీఆర్‌గూడెం కొండ ప్రాంతంలో మణికంఠను హత్య చేసి రోడ్డు మీద పడేశారన్నారు. జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, సర్పంచ్ రేగిడి లక్ష్మి, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, గాడు నాగరాజు, కాకర్ల రాజారావు, వండాన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

హిరమండలం: మండలంలోని పిండ్రువాడ గ్రామంలో నిర్మించిన ఉమారామలింగేశ్వర దేవాలయ ప్రతిష్ట మహోత్సవాలు మూడోవ రోజు బుధవారం వేడుకగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో గ్రామ ప్రదర్శనతోపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.

ఆలయ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెలే కలమట వెంకటరమణ, సిరిపురపు తేజేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పొగాకు ఉత్పత్తులు విడనాడాలి

మెళియాపుట్టి: పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల 60 రకాల క్యాన్సర్ల బారినపడే అవకాశాలు ఉన్నాయని, మండలంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ వీహెచ్ఓ సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇల్లాయిపురం గిరిజన గ్రామ ప్రజలకు పొగాకు వాడకం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గిరిజనులతో మాట్లాడుతూ పొగాకు రహిత సమాజానికి ముందడుగు వేయాలన్నారు. నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్లు రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ దురలవాటు ఉన్నవారు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. పొగాకు ఉత్పత్తులు సేవించే వారికన్నా పక్కన ఉండేవారికి దీని ప్రభావం అధికంగా చూపుతుందన్నారు.



అవగాహన కల్పిస్తున్న వీహెచ్ఓ సంతోష్‌కుమార్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పాతపట్నం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కాగువాడ గ్రామంలో ఫార్మ్‌క్రెఫ్ట్ ఆగ్రో ఇండస్ట్రీ షో రూమ్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘాల రైతులకు సబ్సిడీ ద్వారా ట్రాక్టర్‌లు, స్ప్రేయర్‌లు, వివిధ రకాల యాంత్రాలు రైతులకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అనంతరం రైతులకు ట్రాక్టర్‌లను పంపిణీ చేశారు. తొలిత పాతపట్నం ప్రశాంత్‌నగర్-3లో హోమియో క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్వరాజ్ జనరల్ మేనేజర్ ఆనంద్, టీఎం విజయ్ వర్ధరాజ్, ఎండీ విజయ కృష్ణ, బీఎం ప్రసాద్, ఎఫ్ఓ శ్యామ్, ఏఎంసీ వైస్ చైర్మన్ తాతయ్య, వైస్ ఎంపీపీ ఎస్ ప్రదీప్, కర్రి లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు రాజారావు, ఉమ, ప్రహల్లాద్ పుల్లాయ్ పాల్గొన్నారు.



కాగువాడలో రైతుకు ట్రాక్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం కిటకిట

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం నీలమణిదుర్గ అమ్మవారి పెద్దపండుగలు ముగియడంతో పాతపట్నం నుంచి తిరుగు ప్రయాణం మొదలైంది. పండగలకు వచ్చిన వారంతా సొంతూళ్లకు బుధవారం బయల్దేరారు. దీంతో విపరీతమైన రద్దీ నెలకొంది. పాతపట్నం నుంచి శ్రీకాకుళం, విశాఖపట్నం, టెక్కలి, పాలకొండ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులతో ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కళకళలాడాయి.



పాతపట్నం బస్టాండ్ వద్ద బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



రైల్వేస్టేషన్‌లో రద్దీ

తాగునీటి సరఫరాకు అంతరాయం



పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న సర్పంచ్

నరసన్నపేట: నరసన్నపేటకు తాగునీటి సరఫరా అవుతున్న పైపులైన్ గ్యాస్ కంపెనీ వద్ద మరమ్మతుకు గురికావడంతో పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయ ఏర్పడిందని సర్పంచ్ బూరల్లి శంకర్, ఈఓ సింహాద్రినాయుడు తెలిపారు. పైపులైన్ శిదిలమైన స్థలాన్ని గుర్తించామని మరమ్మతు చర్యలు చేపట్టామన్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. బుధవారం మరమ్మతు పనులను వార్డు సభ్యులు బీఎల్ శర్మతో కలిసి పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని కుశమలపాడు గ్రామంలో గల భువనేశ్వరి సహిత మహా కామేశ్వర శివాలయం వార్షికోత్సవ పూజలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

ఎల్.ఎన్.పేట: జగనన్నకు చెబుదాం విభాగంలో వచ్చే ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం ఉండ కూడదని మండల ప్రత్యేకాధికారి కె.రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. జగనన్నకు చెబుదాం విభాగానికి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి తీసుకున్న చర్యలు కోసం నివేదిక ఇవ్వాలన్నారు. అన్ని స్థాయిల ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తే మండలం నుంచి జగనన్నకు చెబుదాం విభాగానికి ఫిర్యాదులే వెళ్లవన్నారు. తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ, ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, ఈఓపీఆర్డీ జి.శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల నిమజ్జనం



అచ్చుతాపురంలో ఊరేగిస్తున్న నీలమణిదుర్గ విగ్రహం

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం నీలమణిదుర్గ అమ్మవారి పెద్దపండగలు ముగియడంతో వివిధ వీధుల్లో కొలువున్న దేవత విగ్రహాలను బుధవారం సాయంత్రం ఘనంగా ఊరేగించారు. మహేంద్రతనయా నదిలో నిమజ్జనం చేశారు. ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు పండగలు నిర్వహించారు.

ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ స్పందన

కొత్తూరు: ప్రజల వద్దకే నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. నేరడి గ్రామ సచివాలయం పరిధి నీలకంఠాపురంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన మొత్తాలను తెలిపే కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సభ్యులు, వారి కుంటుంబ సభ్యులకు మాత్రమే పథకాలు అందేవన్నారు. నేడు గ్రామ సచివాలయాల ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారమన్నారు. సీఎం జగన్ విద్యా రంగంపై శ్రద్ధ తీసుకోవడంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లతో పోటీ పడుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు సారిపల్లి ప్రసాదరావు, జెడ్పీటీసీ సభ్యులు కామక భాగ్యవతి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ కుంచాల రత్నాలు పార్టీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, మఠం పూర్ణ, గేదెల చిన్నబాబు, గండివలస ఆనందరావు, పంకజ్ దాస్, గొంటి రమేష్, కృష్ణమోహన్, హిరమండలం, ఎల్ఎన్‌పేట పీఏసీఎస్ చైర్మన్‌లు ఏవీ సురేష్, కె.కృష్ణారావు, ఈఓపీఆర్డీ కృష్ణారావు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీని ప్రజలు నమ్మరు

హిరమండలం: అమలు చేయలేని హామీలు ప్రకటించిన టీడీపీని ప్రజలు నమ్మరని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంటక రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్‌లు అన్నారు. హిరమండలంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సాధ్యం కానీ హామీలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు టీడీపీ సిద్ధమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం అమలు చేస్తుంటే దానిపై విమర్శించిన చంద్రబాబు అదే పథకాన్ని పేరు మార్చి టీడీపీ మేనిఫెస్టోలో పెట్టారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేదలను ధనికులుగా చేస్తామని చంద్రబాబు చెబుతున్నారని, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయనకు పేదలు గుర్తురాలేదా అని ప్రశ్నించారు. మహానాడును మాయనాడుగా మార్చారన్నారు. 14ఏళ్లు అధికారంలో ఉండి టీడీపీ చేయలేని సంక్షేమం, అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలోనే సీఎం జగన్ చేసి చూపించారన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షిప్తంగా..

ఇందన పొదుపుపై అవగాహన సదస్సు రేపు

నరసన్నపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఏపీఈపీ డీసీఎల్ ఆధ్వర్యంలో ఇందనపు సామర్థ్యం, ఇందనపు పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఏఈ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అధిక సంఖ్యలో హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందన్నారు. నిపుణులు, విద్యుత్ అధికారులు పాల్గొని సూచనలు చేస్తారన్నారు.

ఇంటర్వ్యూలకు హాజరుకావాలి

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ పోస్టులకు నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు అభ్యర్థులు గురువారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయానికి హాజరుకావాలని సీడీపీఓ హెచ్. కె.కామాక్షి కోరారు. బుధవారం జరగాల్సిన ఇంటర్వ్యూలను గురువారానికి వాయిదా వేశారన్నారు. దీనిని గమనించి సారవకోట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల నుంచి దరఖాస్తు చేసుకున్నవారు తగిన ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

వే బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని పౌర సరఫరాల గోడౌన్ ప్రదేశంలో నూతనంగా మంజూరైన వే బ్రిడ్జి నిర్మాణానికి తహసీల్దార్ సరోజిని బుధవారం స్థల పరిశీలన చేశారు. ఎంఎల్ఎస్ గోదాంను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు, నాణ్యతను పరిశీలించారు. సరుకులు ఉన్న ప్రదేశంలో నిల్వ వివరాలతో కూడిన సూచిక ఏర్పాటు చేయాలన్నా రు. సరుకుల పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

3న బహిరంగ వేలం

హిరమండలం: స్థానిక ఆర్అండ్‌బీ సెక్షన్ పరిధిలోని సెక్షన్ కార్యాలయ ఆవరణంలోని పడిపోయిన మామిడి చెట్లును ఈ నెల 3వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్అండ్‌బీ కార్యాలయలంలో బహిరంగ వేలం వేయనున్నారు. ఏఈ కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కార్యాలయ ఆవరణంలో సుమారు 8 మామిడి చెట్లు పడి ఉన్నాయని, వాటిని వేలం వస్తున్నామన్నారు. ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.2 వేల ధరవాత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని కోరారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: విద్యుత్ సరఫరా అంతరాయం వల్ల పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈదురుగాలుల బీభత్సం వల్ల మంగళవారం అల్మాజీపేట పంపు హౌస్ వద్ద విద్యుత్ స్తంభాలు నేల కొరగడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ అనంతరం నీటి సరఫరా జరుగుతుందన్నారు.

ఆడిట్ తప్పనిసరి

ఆమదాలవలస రూరల్: స్వయం శక్తి సంఘాల సభ్యులు ప్రతీ ఏడాది రికార్డులన్నింటికీ ఆడిట్ చేయించుకోవాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం పైడి కూర్మారావు అధ్యక్షతన బుధవారం సమవేశం నిర్వహించారు. మండలంలోని మహిళా స్వయం శక్తి సంఘాలన్నీ ఏ గ్రేడ్‌లో ఉండేలా సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతిరోజూ షెడ్యూల్ ప్రకారం మొబైల్ బుక్ కీపింగ్ జరిగేలా చూడాలన్నారు. సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

సారవకోట: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సారవకోట, లక్ష్మీపురం, కూర్మనాథపురం, రామకృష్ణాపురం పంచాయతీలలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించినట్లు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ ప్రవల్లికాప్రియ, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



షేక్ హిమావలి మృతదేహం

పాతపట్నం: పాతపట్నం మండలం కాగువాడ గ్రామం చంద్రయ్య కాలనీ వద్ద ఈ నెల 30వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లట గ్రామానికి చెందిన కరణం కేశవరావు మృతి చెందగా, ప్రహరాజపాలేంకు చెందిన యువకుడు షేక్ హిమావలి(29) తీవ్రగాయాలై, విశాఖపట్నం కేజీహెచ్‌లో చేరాడు. ఆ యువకుడు బుధవారం రాత్రి మృతి చెందాడని ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు. ఈ నెల 30వ తేదీన కాగువాడ గ్రామం చంద్రయ్యకాలనీ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో కరణం కామేశ్వరరావు అక్కడే మృతి చెందగా షేక్ హిమావలి గాయాలపాలయ్యాడు. విశాఖలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ మందిరం ప్రతిష్ట

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో బుధవారం హనుమాన్ మందిర ప్రతిష్ట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుమారు రూ.6 లక్షలతో గ్రామస్తులు, దాతలు సహకారంతో నిర్మించారు. బుధవారం పురోహితులు శేషాచల శాస్త్రి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి మందిర ప్రతిష్ట దర్పదర్శనం చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

జోరుగా వన్యప్రాణుల వేట!

సరుబుజ్జిలి: పాలకొండ అటవీ సెక్షన్ పరిధిలోని పలు గిరిజన ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వన్యమృగాలు వేట జోరుగా సాగుతున్నట్లు సమాచారం. సరుబుజ్జిలి నుంచి బూర్జ మండలం వరకు గల అటవీ రేంజ్ పరిధిలోని గ్రామాల్లో ప్రతీరోజు రాత్రి 10 గంటల తరువాత ఇతర ప్రాంతాల నుంచి వేటగాళ్లు వచ్చి జంతువులను వేటాడుతున్నట్లు స్థానికులు తెలిపారు. పబ్లిక్‌గా వాహనాలు మీదుగా వచ్చి వేటాడుతున్న పట్టించుకొనే నాథుడే కరవయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికంగా అడవి పందులను వేటాడి, స్థానికంగా ఉన్న కొంతమందికి విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో డకరవలస, వెన్నెవలస ప్రాంతాల్లో అడవి పందులు మాంసం విక్రయాలు జరిగినట్లు పలువురు చెబుతున్నారు. నిరంతరం అడవిలో జరుగుతున్న కార్యకలాపాలను పర్యవేక్షించాల్సిన ఫారెస్ట్ సిబ్బంది ఆవైపు దృష్టి సారించడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పోలాకి ఎస్ఐగా సత్యనారాయణ

పోలాకి: పోలాకి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా వి.సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ నర్సింహమూర్తిపై పలు కేసుల్లో ఫిర్యాదుదారులు నిరసనలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ సత్యనారాయణ గతంలో ఇక్కడ ఎన్నికల విధులు నిర్వహించారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీడీ రాధ

బూర్జ: మండలంలోని అన్నంపేట ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.మల్లేశ్వరరావుపై గ్రామానికి చెందిన పరిటాల రవి మే 22న జిల్లా కేంద్రంలో గల స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏపీడీ పి.రాధ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన నెయ్యిలవాని చెరువులో 243 మంది వేతనదారులతో, అంచనా విలువ రూ.9 లక్షల 43 వేలతో చేపట్టిన పనులను బుధవారం తనిఖీ చేశారు. సమయపాలన, మస్టర్లపై ఆరా తీశారు. గత సంవత్సరంలో చేపట్టిన పనులపై వేతనదారులతో సమాచారాన్ని రాబట్టారు. సీఆర్పీఎఫ్ ఉద్యోగి భార్యా కూడా వేతనదారుగా రెండు రోజులు పనిచేసినట్లు నమోదు కావడంతో సిబ్బందిని హెచ్చరించారు. ఉన్నతాధికారుల దృష్టికి నివేదిక తీసుకువెళ్తానన్నారు. అలాగే తోటవాడ పంచాయతీ టీడీఆర్‌రాజుపేటలో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. ఏపీఓ వి.రాజ్‌కుమార్, ఈసీ టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.